క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న క్లబ్ ప్రెసిడెంట్ రామ్‌గోపాల్, సెక్రటరీ విజయ్‌కుమార్, విద్యార్థులు

నర్సీపట్నం : అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ బలిఘట్టం జడ్పీ హైస్కూల్లో సోమవారం మొక్కలు నాటారు. క్లబ్ ప్రెసిడెంట్ కర్రి రామ్‌గోపాల్, సెక్రటరీ బేతిరెడ్డి విజయకుమార్, ట్రెజరర్ సుదీర్, క్లబ్ ప్రతినిధులు జమీలు, వికాస్ సతీష్, గొలుసు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రెసిడెంట్ రామ్‌గోపాల్ విద్యార్థులకు సూచించారు. మీ జన్మదినం పేరు ప్రతి ఒక్క విద్యార్థి మొక్క నాటి పరిరక్షిస్తే మీ పాఠశాల నందన వనంగా తయారవుతుందన్నారు. మీరు చేసే ప్రయత్నం ప్రకృతి పరిరక్షణకు దోహదపడుతుందన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ : సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు తెలిపారు. లింగంపేట గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్ వాట్సాప్‌లో అనేకరకాలుగా లింక్‌లు ఇచ్చి ప్రజలను సైబర్ నేరగాళ్లు మోసం చేయడం జరుగుతుందని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత చదువుపై శ్రద్ధ వహించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్ ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో లింగంపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణంలో పలువురు దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. సోమవారం మునగపాక బీసీ కాలనీకి చెందిన కుందిరి మురళి జ్ఞాపకార్థం తల్లితండ్రులు వెంకట సత్యనారాయణ, కనక మహలక్ష్మి దంపతులు రూ.5,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెలగా శ్రీనివాసరావు, ఆడారి కాశీబాబు, పెంటకోట చిన్న, కేవీఎస్ అప్పారావు, వెలగా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందిని కొనసాగించాలని డిమాండ్

అనకాపల్లి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందిని యధావిధిగా కొనసాగించాలని ఏపీ స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జానకి మాట్లాడుతూ 300 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో ఒక్క విద్యార్థి తక్కువ ఉన్నా రెండో శానిటేషన్ సిబ్బందిని తొలగిస్తున్నారని వాపోయారు. ఈ చర్య చాలా అన్యాయమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరందరూ కడు పేదవారని తొలగించడం అన్యాయమన్నారు.

గంగాలమ్మ తల్లి గుడికి విరాళం



విరాళం అందిస్తున్న నాగేశ్వరరావు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. దీనిలో భాగంగా మండలంలోని మూలపేటకు చెందిన భీశెట్టి సాంబమూర్తి జ్ఞాపకార్థం కుమారుడు నాగేశ్వరరావు రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యంత్రంతో సేద్యం.. సౌలభ్యం

పెదనందిపల్లిలో యంత్రంతో ఖరీఫ్ వరి నాట్లు



- రైతులకు ఖర్చు, సమయం ఆదా
- క్రమ పద్ధతిలో నాట్లతో పంటకు గాలి, వెలుతురు
- పంటలో కలుపు సమస్య సకాలంలో గుర్తింపు
- మండలంలో యంత్రంతో 150 ఎకరాల్లో నాట్లు లక్ష్యం
- పెదనందిపల్లిలో 30 ఎకరాల్లో యంత్రంతో నాట్లు పూర్తి

దేవరాపల్లి: యంత్రంతో ఖరీఫ్ వరి నాట్లు వేయడం ద్వారా అన్నదాతలకు బహుళ ప్రయోజనాలు సమకూరుతున్నాయి. ఈ క్రమంలోనే రైతులు యంత్రం ద్వారా వరి నాట్లు వేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న కూలీల సమస్యను అధిగమించడంతో పాటు పెట్టుబడిని ఆదా చేసుకొని నాణ్యమైన దిగుబడులు పొందే అవకాశం ఉంది. తద్వారా సమయాన్ని, శ్రమను ఆదా చేసుకోవచ్చు. దేవరాపల్లి మండలంలో సుమారు 150 ఎకరాలలో మేర యంత్రం ద్వారా నాట్లు వేసేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పెదనందిపల్లిలో సుమారు 30 ఎకరాల మేర యంత్రాలతో నాట్లు పూర్తి చేశారు. ఇంకా బోయిలకింతాడ, వేచలం, మామిడిపల్లి, ఎ. కొత్తపల్లి, కలిగొట్ల గ్రామాల్లో యంత్రం సహాయంతో నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ అధికారులు దగ్గరుండి సలహాలు, సూచనలు అందించి యంత్రంతో నాట్లు వేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు.

ఇవీ ప్రయోజనాలు....

మిషన్‌తో క్రమ పద్ధతి నాట్లు వేయడంతో పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా ఎదుగుతుంది. పంటను తెగుళ్లు సైతం ఆశించకుండా రక్షించుకోవచ్చు. కలుపు సమస్యను సకాలంలో గుర్తించి ఎ మందుల పిచికారికి అవకాశం లభిస్తుంది. పంటకు నీటి తడుపులు ఇచ్చే సమయంలో నీరు ఎక్కువగా ఉన్న చోట దిగువకు విడిచిపెట్టవచ్చు. ఎరువులు అందించేందుకు అనువుగా ఉంటుంది. కూలీలతో నాట్లు వేయించడం ద్వారా ఎకరానికి సుమారు రూ.7 వేల వరకు ఖర్చు కాగా యంత్రంతో రూ. 4500 మాత్రమే ఖర్చు అవుతుంది. దీంతో ఎకరానికి సుమారు రూ. 2500 వరకు రైతులకు ఆదా అవుతుంది. కూలీలతో ఎకరం విస్తీర్ణంలో నాట్లు వేసేందుకు ఒక్క రోజు సమయం పడుతుండగా, యంత్రంతో రోజుకు 5 నుంచి 6 ఎకరాలలో నాట్లు వేసుకోవచ్చు. సాధారణ పద్ధతిలో నాట్లు వేసేందుకు ఎకరానికి ఎకరానికి 60 కేజీల మేర విత్తనాల అవసరం కాగా, యంత్రంతో వరి నాట్లు వేసేందుకు 25 కేజీల విత్తనాలు సరిపోతుంది.




యంత్రం సహాయంతో క్రమ పద్ధతిలో నాట్లు వేసిన వరి పొలం



వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

యంత్రంతో సులభంగా నాట్లు



మూడు ఎకరాల విస్తీర్ణంలో మిషన్ సహయంతో వరి నాట్లు వేశాం. యంత్రంతో నాట్లు వేయడం ద్వారా కూలీల ఖర్చు, విత్తనాల ఖర్చు బాగా తగ్గుతుందని చెప్పడంతో మిషన్‌తో నాట్లు వేయించాను. ఎకరానికి రూ.4500 చొప్పున మూడు ఎకరాలకు రూ.13,500 మేర ఖర్చు అయింది. కూలీలతో నాట్లు వేస్తే ఎకరానికి రూ. 7వేలు వరకు ఖర్చు అయ్యేది. పాత పద్ధతిలో ఎకరానికి 60 కేజీల విత్తనాలు అవసరం కాగా, ఈ విధానంలో 25 కేజీల విత్తనాలు సరిపోయాయి. విత్తన ఖర్చు తగ్గడంతో పాటు శ్రమ కూడా లేకుండా పోయింది.

–చిత్రాడ జగదీష్, రైతు పెదనందిపల్లి

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం...



తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ నేపథ్యంలోనే యంత్రంతో నాట్లు వేసే విధానంతో కలిగే ప్రయోజనాలతో రైతులకు వివరించడంతో పలువురు ముందుకు వచ్చారు. మండలంలో సుమారు 150 ఎకరాల్లో యంత్రంతో నాట్లు వేసేందుకు లక్ష్యం కాగా ఇప్పటికి పెదనందిపల్లిలో సుమారు 30 ఎకరాల మేర నాట్లు పూర్తి చేశాం. మిషన్ ద్వారా నాట్లుతో కూలీల ఖర్చు, విత్తన ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి ఆశాజనంగా ఉంటుంది. –ఎల్.వై. కాంతమ్మ, వ్యవసాయ అధికారి, దేవరాపల్లి

సర్పంచ్ రాముకు మాజీ ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



లింగంపేట సర్పంచ్ రామును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం : లింగంపేట గ్రామ సర్పంచ్ లోకవరపు రాము మాతృమూర్తి లింగతల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో రామును మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సోమవారం పరామర్శించారు. మనో ధైర్యం కల్పించారు. రాము మాతృమూర్తి లింగతల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నీకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని రాముకు మాజీ ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రామును పరామర్శించిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కరక అప్పలరాజు, వెదురుపల్లి, రాజుపేట అగ్రహారం సర్పంచులు కాళ్ల సత్యనారాయణ, గుడపర్తి అచ్చియ్యనాయుడు, మన్యపురట్ల మాజీ సర్పంచ్ ముత్తా శివాజీ ఉన్నారు.

నిల్వ నీటితో జ్వరాలు ప్రబలే అవకాశం



వి.సంతపాలెంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ

కె.కోటపాడు : వర్షాకాలం నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో నిల్వ, మురుగునీరు లేకుండా ప్రజలు జాగ్రత్తలను పాటించాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ తెలిపారు. వి.సంతపాలెంలో సోమవారం జాతీయ డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ప్రజలతో కలిసి ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, గోలాల్లో రోజుల కొలది నీరు నిల్వ ఉండడం వల్ల నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, దోమకాటు ద్వారా డెంగ్యూ వ్యాధి ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ఎప్పటికప్పుడు ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులపై అధికారుల ఒత్తిడి సహించం

- తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలి
- పీఆర్‌టీయూ నాయకుల డిమాండ్



ప్రభుత్వానికి నివేదించే లేఖను చూపుతున్న పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు వరహాలనాయుడు, రమేష్

నర్సీపట్నం : జీవో పాపర్టీ(పి–4) కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకోవాలంటూ విద్యాశాఖ అధికారులు నిర్బంధం చేయడం సరికాదని పీఆర్‌టీయు నర్సీపట్నం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు, జి.వి.రమేష్ పేర్కొన్నారు. పి–4 విధానంలో భాగంగా ప్రతి ప్రధానోపాధ్యాయుడు కనీసం ఐదు కుటుంబాలు, ఉపాధ్యాయులు రెండు కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకుని ఆన్‌లైన్ రిజిస్టర్ చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించడం వల్ల ఒత్తిడికి గురి కావాల్సి వస్తోందన్నారు. ఉపాధ్యాయులకు లింక్‌లు పంపి రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని పదే పదే ఒత్తిడి చేయడం, అత్యవసరంగా పూర్తి చేయాలంటూ ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటి వరకూ ఒక్క డీఏ కూడా మంజూరు చేయలేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించలేదన్నారు. వెంటనే పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ఇటీవల బదిలీలలో సర్దుబాటుకు గురై దాదాపు 2 నెలలుగా జీతాలు పొందలేకపోతున్న ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేత పనులు అప్పగించడం వల్ల విద్యావ్యవస్థ కుంటుపడుతుందన్నారు. విద్యార్థులకు బోధన చేసే సమయాన్ని ఉపాధ్యాయుడికి ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎవరైనా స్వచ్ఛందంగా పి–4 కార్యక్రమంలో భాగస్వాములైతే హర్షిస్తామన్నారు. అంతే తప్ప విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులపై రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటూ ఒత్తిడి చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు బలవంతంగా రిజిస్టర్ కావలసిన అవసరం లేదని ఆందోళన చెందవలసిన పని భరోసా కల్పించారు. రిజిస్టర్ కావాలని నిర్బంధం చేస్తే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పీఆర్‌టీయు కార్యాచరణ రూపొందించి ఉపాధ్యాయులకు అండగా నిలుస్తుందన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండల సర్వ సభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో భానోజీరావు తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్‌గా శామ్యూల్ జయ ఆనంద్

నర్సీపట్నం : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్‌గా పసుపరి సామ్యూల్ జయ ఆనంద్‌ను నియమిస్తూ ఏపీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ పాలక్‌వర్మ నియామక పత్రాన్ని అందజేశారు. నర్సీపట్నంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి డాక్టర్ పాలక్‌వర్మ ముఖ్య అతిథిగా విచ్చేసారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఎస్టీ సెల్ చైర్మన్ మాట్లాడుతూ పార్టీ ఎదుగుదలకు తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్మన్ నవభారత్ పాల్గొన్నారు.

తల్లికి వందనం...కాదు క్షోభ..!

- ఆన్‌లైన్‌లో ఇష్టానుసారం పేర్ల నమోదు..
- తప్పులు సరిదిద్దాలని కోరుతూ వెల్లువెత్తుతున్న అర్జీలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రతి వారం తల్లికి వందనంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నర్సీపట్నం మున్సిపాలిటీ పాతబస్టాండ్ ప్రాంతానికి చెందిన కణితి అన్నపూర్ణ మా బాబు కణితి దుర్గా సత్య సంపత్ పదో తరగతి చదువుతున్నాడు. తల్లికి వందనం పథకం డబ్బులు పడలేదు. సచివాలయానికి వెళ్లి సంప్రదిస్తే మా బాబుకు సంబంధించిన వివరాల్లో తల్లిగా నా పేరు లేదు. కిల్లో స్వప్న పేరు యాడ్ అయి ఉంది. తల్లిగా వేరొకరిని నమోదు చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగిగా పెన్షన్ పొందుతున్నారని, వెయ్యి ఎస్ఎఫ్‌టీ స్థిరాస్తి ఉందని, పది ఎకరాలు ల్యాండ్, 300 యూనిట్లకు మించి విద్యుత్ వాడుతున్నారని, కారు ఉందని ఆన్‌లైన్‌లో చూపిస్తుందన్న విషయాన్ని ఆమె ఆర్డీవో వి.వి.రమణ దృష్టికి తీసుకువెళ్లింది. మాకు ఎలాంటి ఆస్తులు లేవు, తల్లికి వందనం డబ్బుల మాట దేవుడెరుగు...నా కొడుక్కు తల్లినే మార్చేశారని అన్నపూర్ణ ఆర్డీవో వద్ద ఆవేదన వెళ్లబుచ్చింది. ఇలాంటి ఫిర్యాదులు ప్రతి వారం వస్తున్నా పరిష్కరించడంలో జాప్యం ఏర్పడుతుంది. సోమవారం నిర్వహించిన పరిష్కార వేదికలో తల్లికి వందనం, భూ సమస్యలు, రేషన్‌కార్డులు తదితర సమస్యలపై 20 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో రమణ తెలిపారు. ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. తనకు భర్త లేడని వితంతు పింఛను ఇప్పించాలని గొలుగొండ మండలం, ఏటిగైరంపేటకు చెందిన ప్రగడ సత్యవతి అర్జీ పెట్టుకుంది. పింఛన్లతో పాటు ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలని ఆర్డీవో ఆయశాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం తహసీల్దార్ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



దేవరాపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

దేవరాపల్లి : జీవో నెంబర్ 1217ను రద్దు చేసి, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు డిమాండ చేశారు. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి అనంతరం స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న 46 వేల దరఖాస్తులను పరిష్కరించి నిధులు మంజూరు చేయాలని ఈశ్వరరావు కోరారు. గతంలో వాడుకున్న బోర్డు నిధులను తిరిగి జమ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పథకాలతో సంబంధం లేకుండా 1996 చట్టం అమలు చేసి 12 రకాల సౌకర్యాలు అందించాలని, సంక్షేమ బోర్డులో కార్మికుల ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కార్మికశాఖ కార్యాలయాలో ఖాళీలను భర్తీ చేయాలని, కొత్త గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు పాత కార్డులను రెన్యువల్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాభై ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు 6 వేలు పింఛను అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లెక్కల లక్ష్మీ, కర్రి శ్రీనివాసరావు, సుందరరావు, పిల్ల చిన్నప్పరావు, జాన శ్రీను పాల్గొన్నారు.

ఖరీఫ్ వరినాట్లు పనుల్లో రైతులు బిజీబిజీ



పైడంపేటలో వరి నాట్లు వేసే పనుల్లో మహిళలు



ఊర చెరువు ఆయకట్టు పరిధిలో వేసిన వరినాట్లు



ముకుందపురంలో ఏపుగా పెరిగిన వరినారు


కె.కోటపాడు : ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ప్రస్తుతం అనుకూలమైన వాతావరణం ఉంది. దీంతో ఖరీఫ్ సాగులో భాగంగా వరినాట్లు వేసే పనుల్లో రైతులు బిజిబిజీగా ఉన్నారు. ఇప్పటికే మడుల్లో వరినారు ఎదగడంతో దమ్ములు పూర్తి చేసిన పొలాల్లో మహిళా కూలీలు నాట్లు వేసే పనులు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో 2800 హెక్టార్లలో వరినాట్లు వేయనున్నారు. ప్రస్తుతం డి.అగ్రహారం, పాడుగుపాలెం, ఎ.భీమవరం, మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, పైడంపేట గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో పొలాలను దమ్ములు చేసే పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతం అడపా వర్షాలు కురుస్తుండడంతో ఆగస్టు మూడో వారం నాటికి మండలంలో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యే అవకాశాలున్నాయని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు.

జలాశయాల పరిధిలో...

మాడుగుల రూరల్: నీటి ఆధారం ఉన్న పంట భూముల్లో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల కోనాం, పెద్దేరు, తారకరామ, జలాశయాల్లో ఖరీఫ్ వరినాట్లు కోసం నీరు విడుదల చేశారు. దీంతో ఈ ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం వరినాట్లు వేస్తున్నారు. కె.జె.పురం, వంటర్లపాలెం, గ్రామాల్లో కోనాం జలాశయం ఆయకట్టు పరిధిలో వరినాట్లు వేస్తున్నారు. తారకరామ, పెద్దేరు, జలాశయం పరిధిలో గల గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. మెట్ట భూముల్లో వరినాట్లు వేయడానికి విద్యుత్ మోటారు పంపుసెట్ల ద్వారా వరినాట్లు వేస్తున్నారు. అయితే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తి రోడ్లు తక్షణం పూర్తి చేయాలి


- పీజీఆర్‌ఎస్‌లో సీపీఎం నేత వెంకన్న వినతి పత్రం



ఎంపీడీవో కార్యాలయం పీజీఆర్‌ఎస్‌లో వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి : మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లను తక్షణమే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. వాలాబు పంచాయతీలోను, చింతలపూడి పంచాయతీ వీరభద్రపేట రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోవడంతో స్థానిక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాలాబు పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాల్లో రూ.12 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారని, చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటకు రూ. 84 లక్షలు నిధులు మంజూరు చేయగా ఎర్త్ వర్కు చేసి మిగిలిన పనులు నిలిపివేశారన్నారు. బోడిగరువు, నేరెళ్లపూడి రోడ్డు సైతం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించి అసంపూర్తి రోడ్డు పనులు పూర్తి చేసి, కాంట్రాక్టర్లకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని వెంకన్న కోరారు.

సుజల స్రవంతి నిర్వాసితుల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నల్లరేగుడుపాలెం గ్రామం రైతులు

అనకాపల్లి టౌన్: సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, బలవంతపు భూ సేకరణ చేయొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఆవరణలో సబ్బవరం మండలం నల్లరేగుడుపాలెం రెవెన్యూ గ్రామ రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వీరంతా 70 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములు కోల్పోవడం వల్ల రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ఈ భూములకు బదులు వేరొక చోట భూములు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువకు నాలుగు రెట్లు నష్టపరిహారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో గంటా శ్రీరామ్, వి. నరేంద్ర కుమార్, పెతకంశెట్టి రమేష్, బుగుడి నూక అప్పారావు, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.